క్లుప్తంగా

ఓటు హక్కు ప్రాముఖ్యతపై కళాజాత



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి రాజీవ్‌నగర్, ముష్టిపల్లిలో తెలంగాణ సాంస్కృతిక సారధి ఆధ్వర్యంలో ఓటు హక్కు ప్రాముఖ్యతపై కళాజాత ప్రదర్శన నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన పౌరులందరికి భారత రాజ్యాంగం ఓటు హక్కును కల్పించిందని, ఇట్టి ఓటు హక్కులను అర్హులందరూ వినియోగించుకోవాలన్నారు. మనం వేసే ఓటే మన భవిష్యత్‌ని నిర్ణయిస్తుదని, అలాంటి ఓటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లోనవ్వకూడదని, తదితర అంశాలపై ఆట పాటలతో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి నర్సింహ, తెలంగాణ సాంస్కృతిక సారధి జిల్లా కోఆర్డినేటర్ ఎడమల శ్రీధర్‌రెడ్డి, పోత్తూరి రాజు, శ్రీరాముల రాంచంద్రం, గడ్డం దేవయ్య, గడ్డం శ్రీనివాస్, గుగ్గిళ్ళ పర్షరాం, వంతడపుల గణేశ్, పూడూరి సంజీవ్, అంతడపుల ఝాన్సి, లావణ్య, కిన్నెర, శ్రీలత, శీరిష పాల్గొన్నారు.

ఉద్యోగాలు సాధించిన యువకులకు సన్మానం



సన్మానం చేస్తున్న నాయకులు

గంభీరావుపేట: మండలంలోని నర్మాల గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. వారిని గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, పలువురు నాయకులు బుధవారం శాలువాలతో సత్కరించారు. పసుపునూరి వంశీ ఇండియన్ ఆర్మీలో జనరల్ డ్యూటీ, పాక వేణు రాష్ట్ర పోలీస్ విభాగంలో, పాక రంజిత్ అగ్నిపథ్‌లో అగ్రివీర్‌లో ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎడబోయిన రాజు, ఎంపీటీసీ బాలమణి, బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు రాజేందర్, ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ రాజేందర్, సింగిల్‌విండో డైరెక్టర్ రాజేశ్వర్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పరుగు పందెం పోటీల్లో విజేతకు సన్మానం



శ్రీహన్సిని సన్మానిస్తున్న యువకులు

బోయినపల్లి: జిల్లాస్థాయి పరుగు పందెం పోటీల్లో 4 గోల్డ్ మెడల్స్ సాధించిన మండలంలోని స్తంభంపల్లి గ్రామానికి చెందిన ఎర్ర చంద్రకళ లచ్చయ్య కూతురు శ్రీహన్సిని బుధవారం గ్రామస్తులు అభినందించారు. నర్మాల టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ జూనియర్ కళాశాలలో శ్రీహన్సి ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న శ్రీహన్సి రాజన్న సిరిసిల్ల జోన్ పరిధిలోని అండర్–19 అథ్లెటిక్స్ విభాగంలో 3 కే, 1500 మీటర్లు, 800 మీటర్లు, 400 మీటర్ల పరుగుపందెం పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో బహుమతులు సాధించాలని ఆకాంక్షించారు. గౌడ సంఘం మండల అధ్యక్షుడు బొంగాని అశోక్, చింతల శ్రీనివాస్, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

‘సెస్’ షాక్

- అధికారుల నిర్లక్ష్యం వినియోగదారులకు శాపం
- విద్యుత్ రీడింగ్‌లో జాప్యం
- తడిసిమోపెడవుతున్న బిల్లులు
- ఇబ్బందుల్లో వినియోగదారులు
- యూనిట్లు పెరగడంతో బిల్లుల మోత



ఈ ఫొటోలో విద్యుత్ బిల్లు చూపిస్తున్న వ్యక్తి పేరు గోస్వామి, ఎల్లారెడ్డిపేటలో స్వీట్ హౌస్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. గత నెల విద్యుత్ బిల్లు రూ.1,551 వస్తే, ఈనెల రూ.1,667 వచ్చిందని చెబుతున్నాడు. ఇంతింత బిల్లులు కట్టలేక వ్యాపారం నడపడం ఇబ్బందిగా ఉందంటున్నాడు. కిరాయిలకు దగ్గరలో కరెంట్ బిల్లులు వస్తున్నాయని, ప్రతీ నెలా 10వ తేదీలోపు రీడింగ్ తీయాల్సి ఉండగా ఆలస్యం కావడంతో స్లాబ్ మారి బిల్లులు పెరుగుతున్నాయని ఆయన తెలిపారు. అధికారులు స్పందించి సకాలంలో రీడింగ్ తీసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాడు. ఇది ఒక గోస్వామి సమస్యనే కాదు, ప్రతీచోట విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్య..



ఎల్లారెడ్డిపేట సెస్ కార్యాలయం

ఎల్లారెడ్డిపేట: విద్యుత్ బిల్లుల రీడింగ్‌లో అంతులేని జాప్యం వినియోగదారులకు శాపంగా మారుతోంది. సకాలంలో రీడింగ్ తీయని కారణంగా మోయలేని భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సెస్ అధికారుల పూర్తి నిర్లక్ష్యం మూలంగా అధిక బిల్లులతో లబోదిబో మంటున్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని 24 గ్రామాల పరిధిలో 1600 మీటర్లు ఉండి విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. మండల పరిధిలో 14 మంది హెల్పర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. కేటగిరి 01, కేటగిరి 02ల వారీగా విద్యుత్ మీటర్లు ఉంటాయి. అయితే సెస్ సిబ్బంది పదో తేదీ వచ్చినా విద్యుత్ బిల్లులు రీడింగ్ తీయడం లేదు. దీంతో రీడింగ్ కొట్టకపోవడంతో వినియోగదారులకు యూనిట్లు ఎక్కువగా పెరగడం వల్ల మూడింతలు బిల్లు వస్తుందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో సెస్ పరిధిలో ప్రతి నెలా 2 నుంచి 10వ తేదీలోపు సిబ్బంది రీడింగ్ తీస్తారు. అయితే రీడింగ్ సకాలంలో తీయకపోవడంతో బిల్లులు ఎక్కువగా రావడంతో సామాన్యులు బిల్లులు కట్టలేకపోతున్నామని అంటున్నారు.

యూనిట్లు పెరిగితే మోతే

సెస్ నిబంధనల ప్రకారం 0.50 యూనిట్ల వరకు రూ.1.95, 51 టు 100 యూనిట్ల వరకు రూ.3.10, 100కు పైగా యూనిట్లకు రూ.3.40 చొప్పున వినియోగదారులకు విద్యుత్ బిల్లులు వస్తుంది. విద్యుత్ వాడకం ప్రకారం బిల్లులు వస్తుండగా వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేవు. అయితే రీడింగ్ సకాలంలో తీయని కారణంగా రోజులు పెరగడంతో యూనిట్లు పెరిగి బిల్లులు వాచిపోతున్నాయి. ప్రతి నెల 2 నుంచి 10వ తేదీ వరకు రీడింగ్ తీస్తే వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. కొంతకాలంగా రీడింగ్ పూర్తిచేయాల్సిన సమయం 10వ తేదీ ఉండగా, ఆ తేదీ నుంచే రీడింగ్ తీస్తున్నారు. ప్రతి నెల ఎక్కువ మొత్తంలో బిల్లులు రావడంతో కట్టలేక పోతున్నామని సామాన్యులు వాపోతున్నారు. బిల్లులు చెల్లించేందుకు అప్పులు చేయాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వాడకం ప్రకారమే బిల్లులు

రీడింగ్ ఆలస్యంగా తీయడం వల్ల ఎలాంటి ఇబ్బందులు ఉండవని సెస్ అధికారులు అంటున్నారు. వాడకం ప్రకారమే బిల్లులు వస్తాయని చెపుతున్నారు. వినియోగదారుల ఆరోపణలకు అధికారుల మాటలకు పొంతన లేకుండా పోతోంది. సహజంగా కూడా యూనిట్లు పెరిగితే బిల్లుల్లో తేడాలు వస్తాయనే నిబంధనలు అధికారులే వివరిస్తున్నారు. ఆలస్యంగా రీడింగ్ తీస్తే ఇబ్బందులుండవని కూడా వారే అంటుండడంతో వినియోగదారులు అయోమయానికి గురవుతున్నారు. ఏది సత్యమో అధికారులే స్పష్టం చేయాలి. మొత్తంగా రీడింగ్‌లో జాప్యం జరిగిందని అధికారులే ఒప్పుకుంటున్నారు. సెస్ సిబ్బంది నిర్లక్ష్యంతో రీడింగ్‌లో జాప్యంపై సెస్ ఎండీకి ఫిర్యాదు చేస్తామని వినియోగదారులు అంటున్నారు. సెస్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ప్రజల జేబులకు తూట్లు పడుతున్నాయి. ఎక్కువగా వచ్చిన బిల్లులను తగ్గించాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు. లేని పక్షంలో కరెంట్ బిల్లులు చెల్లించమని పేర్కొంటున్నారు.

అధికారుల నిర్లక్ష్యమే కారణం



సెస్ అధికారుల నిర్లక్ష్యం మూలంగా విద్యుత్ బిల్లులు అధికంగా వచ్చి మా జేబులకు చిల్లులు పడుతున్నాయి. నిబంధనల ప్రకారం రీడింగ్ తీస్తే ఎవరికి ఇబ్బందులు ఉండవు. సిబ్బంది వారికి ఇష్టం వచ్చిన తేదీల్లో రీడింగ్‌లు తీస్తున్నారు. ఫలితంగా యూనిట్లు పెరిగి బిల్లులో తేడాలు వస్తున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలి.

– శ్యామంతుల అనిల్, ఎల్లారెడ్డిపేట

ఇబ్బందులు ఉండవు

రీడింగ్ తీయడంలో జాప్యం జరిగితే బిల్లులలో పెద్ద తేడాలుండవు. ఈ విషయంలో వినియోగదారులు ఆందోళనకు గురికావద్దు. కరెంట్ ఎంత వినియోగిస్తే అంతే బిల్లులు వస్తాయి. యూనిట్లలో మార్పులు వస్తే మాత్రం బిల్లులో తేడాలుంటాయి. ఈ నెల రీడింగ్ తీయడంలో జాప్యం జరిగింది. భవిష్యత్తులో రీడింగ్ సకాలంలో తీసే విధంగా చర్యలు తీసుకుంటాం.

– పృథ్వీధర్‌గౌడ్, సెస్ ఏఈ, ఎల్లారెడ్డిపేట

రాజన్న పాలన అందించడమే లక్ష్యం



మాట్లాడుతున్న చొక్కాల రాము

సిరిసిల్లఅర్బన్: రాష్ట్రంలో వైఎస్ రాజశేఖరరెడ్డి సంక్షేమ పాలన అందించడమే వైఎస్‌ఆర్‌టిపి లక్ష్యం అని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము అన్నారు. బుధవారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో వైఎస్ఆర్‌టీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో పేదలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత వైఎస్సార్‌ది అని కొనియాడారు. ఆరోగ్యశ్రీ, 108 సేవలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. నోటిఫికేషన్లు ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేయడంతో ఎంతో మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ప్రవళిక అనే నిరుద్యోగి ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. సిరిసిల్ల నియోజకవర్గం నుంచి వైఎస్‌ఆర్‌టీపీ అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని తెలిపారు. ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్‌టీపీ పట్టణాధ్యక్షుడు మ్యాన లక్ష్మీనారాయణ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగరి అనిల్, తంగళ్లపల్లి మండలాధ్యక్షుడు పుర్మాణి కరుణాకర్‌రెడ్డి, జింక ఎల్లయ్య, రాచర్ల రాజు, గూడెల్లి రాజు, శంకర్ ఉన్నారు.

బెస్ట్ బ్యూటీషియన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న బ్యూటీషియన్ రాధిక

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణానికి చెందిన హన్సిని హెర్బల్ బ్యూటీ పార్లర్ వ్యవస్థాపకురాలు గడప రాధికకు ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన ఆల్ ఇండియా బహుజన రైటర్స్ 4వ నేషనల్ కాన్ఫరెన్స్‌లో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా కృష్ణ బెస్ట్ బ్యూటీషియన్ నేషనల్ అవార్డును అందించినట్లు తెలిపారు.

వాహన తనిఖీలు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల పట్టణంలోని స్థానిక కొత్త చెరువు, తదితర ప్రాంతాల్లో టౌన్ సీఐ ఉపేందర్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి వాహనాలను తనిఖీ చేపట్టారు.

కోనరావుపేట: మండలం మల్కాపేట గ్రామ శివారులో ఎస్సై ఆంజనేయులు, ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి బుధవారం తనిఖీలు నిర్వహించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

తంగళ్లపల్లి: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఇల్లంతకుంట ఎస్సై దాస సుధాకర్ తెలపారు. మండలంలోని వల్లంపట్ల నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారనే సమాచారంతో సిబ్బంది శ్రీనివాస్, శ్రీకాంత్ కలిసి వెళ్లి సీజ్ చేసి స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ట్రాక్టర్ యజమాని నాయిని శ్రీనివాస్‌తోపాటు డ్రైవర్ ప్రదీప్‌పై కేసు నమోదు చేశామన్నారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బెల్టు షాపుపై దాడి మద్యం స్వాధీనం



సీజ్ చేసిన మద్యాన్ని చూపుతున్న ఎస్సై

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలంలోని నర్సక్కపేటలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టుషాపుపై బుధవారం దాడి చేసి రూ.11 వేలు విలువ చేసే మద్యాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. షాపు నిర్వహిస్తున్న ముత్యం రాములు అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా మద్యం అమ్మకాలు జరిపితే కేసు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. హెడ్‌కానిస్టేబుల్ భూమయ్య, కానిస్టేబుళ్లు తిరుపతి, మధు పాల్గొన్నారు.

పరామర్శ

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌కు చెందిన నాగుల కమలబాయి ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాన్ని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



బోయినపల్లిలో అమ్మవారికి మంగళహారతి



కోనరావుపేట: బావుసాయిపేటలో కుంకుమపూజ



గంభీరావుపేటలో..

కుంకుమ పూజలు, అన్నదానాలు

దేవీ శరన్నవరాత్రోత్సవాలు జిల్లాలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు. మరోవైపు అన్నదాన కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. ప్రజాప్రతినిధులు, నాయకులు అమ్మవారిని దర్శించుకొని మొక్కుకున్నారు. – తంగళ్లపల్లి/బోయినపల్లి/కోనరావుపేట/గంభీరావుపేట

చల్మెడకు రెడ్డి సంఘం మద్దతు

వేములవాడ: వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన రెడ్డి సంఘం సభ్యులు బుధవారం బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావును కలిసి తమ మద్దతు ప్రకటించారు. భవిష్యత్‌లో రెడ్డి సంఘం సభ్యుల సంక్షేమానికి తనవంతు సహాయ, సహకారాలు ఉంటాయని చెల్మెడ వారికి హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఊరడి ప్రవీణ్, సర్పంచ్ ఊరడి రాంరెడ్డి, రెడ్డి సంఘం అధ్యక్షుడు ఎల్లాల రాంరెడ్డి, మహేందర్, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కోనరావుపేట: మండలంలోని ధర్మారంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎన్నికల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం చల్మెడకు మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. గౌడ సంఘం అధ్యక్షుడు పొన్నం తిరుపతి, కార్యదర్శి తాళ్లపెల్లి శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆబాద్ పార్టీ కరపత్రాన్ని సిరిసిల్ల నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి రాగుల రాములు ఆవిష్కరించారు. నాయకులు సుధీర్, హసన్ షేక్, క్యారం రాకేశ్, చింతకుంట సన్ని పాల్గొన్నారు.

కోలాటాలతో హోరెత్తిన రాజన్న సన్నిధానం



వేములవాడ: కోలాటాలు ఆడుతున్న మహిళలు



సిరిసిల్లలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

వేములవాడ: బతుకమ్మ పాటలతో, కోలాటాలతో రాజన్న సన్నిధానం హోరెత్తింది. బుధవారం రాత్రి ఆలయ ఆవరణలో బతుకమ్మ ఆట ఆడిన మహిళలు, యువతులు ధర్మగుండంలో నిమజ్జనం చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో కోలాటాలతో కొత్త కొత్త పాటలతో హోరెత్తించారు. ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

సిరిసిల్లలో..

సిరిసిల్లటౌన్: పట్టణంలోని కూడళ్లలో బతుకమ్మ వేడుకలు జరుగగా, స్థానిక శ్రీవేంకటేశ్వరాలయం వద్ద రెడ్డి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలు అలరించాయి.

కళాశాలల్లో బతుకమ్మ వేడుకలు



ఎల్లారెడ్డిపేట/వేములవాడఅర్బన్/రుద్రంగి: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో బుధవారం అధ్యాపకులు, విద్యార్థినులు బతుకమ్మలను పేర్చి బతుకమ్మ ఆటపాటలతో అలరించారు. కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్ క్యాతం సత్యనారాయణ, ప్రమోద్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి వాసరవేణి పర్శరాములు, అంజయ్యతో పాటు అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

వార్డులో కౌన్సిలర్ల ప్రచారం



వేములవాడ: బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు గెలుపు కోసం పట్టణంలోని 21 కౌన్సిలర్ నరాల శేఖర్ బృందం, 3వ వార్డులో కౌన్సిలర్ నిమ్మశెట్టి విజయ్ బృందంతో బుధవారం వార్డుల వారీగా ప్రచారం మొదలుపెట్టారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు బత్తుల దేవరాజు, నాయకులు పాల్గొన్నారు.

డబ్బు పంపిణీపై ఫిర్యాదు

సిరిసిల్లక్రైం: ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు సిరిసిల్లలో డబ్బు పంపిణీ చేసిన విధానంపై వచ్చిన ఫిర్యాదుతో సిరిసిల్లటౌన్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఈనెల 17న సిరిసిల్లలో ఓటర్లకు డబ్బులు ఇస్తున్న విధానంపై ఫ్లయింగ్ స్క్వాడ్ టీం బాధ్యులు ఎం.రుత్విక్ రెడ్డి సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎన్నికల నియామావళిని భేఖాతర్ చేస్తూ పలువురికి ఒకరు డబ్బులు ఇవ్వడం నేరమని అలాంటి వ్యక్తిపై చట్టపరమైన చర్యలకు వెళ్లాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. సెక్షన్ 188, 171బీ, 171ఈ కింద కేసు నమోదు చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

హామీలను నెరవేర్చే సత్తా కాంగ్రెస్‌కే ఉంది

- సిరిసిల్ల కాంగ్రెస్ అభ్యర్థి కేకే మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

ముస్తాబాద్: ఇచ్చిన మాటకు కట్టుబడి వుండేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని హామీలను నెరవేర్చే సత్తా కాంగ్రెస్‌కు మాత్రమే ఉందని సిరిసిల్ల కాంగ్రెస్ అభ్యర్థి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఆవునూర్‌లో బుధవారం పలు పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానించారు. అలాగే బందనకల్‌లో గడప గడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రజల ఆకాంక్ష మేరకు ఇచ్చిన మాటకు కట్టుబడి సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారన్నారు. జలయజ్ఞంతో వ్యవసాయాన్ని పండగ చేసిన ఘనత దివంగత సీఎం వైఎస్సార్‌కు దక్కుతుందన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి మిర్యాల్‌కార్ శ్రీనివాస్, మండల శాఖ అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి పాల్గొన్నారు.


యువతను మోసగించిన సర్కారు

సిరిసిల్లటౌన్: యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఓట్లు దండుకుని గద్దెనెక్కిన బీఆర్ఎస్ సర్కారు వారిని నిలువునా మోసగించిందని సిరిసిల్ల కాంగ్రెస్ అభ్యర్థి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం సిరిసిల్లలోని పార్టీ ఆఫీసులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నోటిఫికేషన్లు, ఉద్యోగాల నియామకాలు లేకుండా చాలామంది యువత ఆత్మహత్యలకు పాల్పడినా పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. సిరిసిల్లలో పైసలు పెట్టి నిర్వహించిన సభ విజయవంతమైందని జబ్బలు చర్చుకోవడం అధికార పార్టీకే చెల్లిందని, రాబోయే ఎన్నికల ఫలితాల్లో బీఆర్ఎస్‌కు పరాభవం తప్పదన్నారు.

పార్టీలో చేరిన యువకులు

సిరిసిల్లలోని 22వ వార్డుకు చెందిన పలువురు యువకులు కాంగ్రెస్‌లో చేరగా వారికి కేకే కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ యెల్లె లక్ష్మీనారాయణ, వైద్య శివప్రసాద్, సూర దేవరాజు, మ్యాన ప్రసాద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల గ్రామం నుంచి మానకొండూర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో రెడ్డి సంఘం అధ్యక్షుడు చల్ల మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ కట్ట గురువారెడ్డి, కరుణాకర్ రెడ్డి, మారుపాక నరసింహచారితోపాటు 40 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు చీటి ఆనందరెడ్డి, మండల అధ్యక్షుడు భూంపల్లి రాఘవరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు ఎలగందుల ప్రసాద్ పాల్గొన్నారు.

‘ఆరు గ్యారంటీలతో గెలుపు’



ఎల్లారెడ్డిపేట: కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన ఆరు గ్యారంటీ కార్డులతో ఈ ఎన్నికల్లో గెలుపు ఖాయమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం పదిర, హరిదాస్‌నగర్, దుమాల, అక్కపల్లి గ్రామాల్లో బుధవారం గడపగడపకు గ్యారంటీ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని బస్వాపూర్ గ్రామంలో గడప గడపకు కాంగ్రెస్ నాయకులు మునిగెల రాజు, పొన్నాల పర్శరాం, శ్రీనివాస్, మల్లేశం, లక్ష్మీరాజం, భరత్ గౌడ్, ప్రశాంత్ ప్రచారం చేశారు.

కారు గుర్తుకు ఓటెయ్యండి



ప్రచారం చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీలు

రుద్రంగి: మండల కేంద్రంలో ఎంపీపీ గంగం స్వరూపారాణి, జెడ్పీటీసీ గట్ల మీనయ్య స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అందిస్తున్న సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో వేములవాడ ఎమ్మెల్యేగా చల్మెడ లక్ష్మీనర్సింహారావును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, కోఆప్షన్ మెంబర్ జమీలా బేగం, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దయ్యాల కమలాకర్, నాయకులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా సమావేశాలు నిర్వహించొద్దు

- వేములవాడ ఆర్డీవో మధుసూదన్



మాట్లాడుతున్న ఆర్డీవో మధుసూదన్

వేములవాడ: ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం కాకుండా ఇతర విధాలుగా సభలు, సమావేశాలు నిర్వహించే వారిపై చర్యలు తీసుకోవాలని ఆర్డీవో మధుసూదన్ వివరించారు. బుధవారం తన కార్యాలయంలో నియోజకవర్గంలోని అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశమై మాట్లాడారు. అనుమతి లేకుండా రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎలాంటి కార్యక్రమాలను నిర్వహించరాదన్నారు. నియమావళి ఉల్లంఘించకుండా ప్రత్యేక బృందాలతో నిఘా పెంచామన్నారు. మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, మూడు చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గ పరిధిలో మొత్తం 2,18,160 మంది ఓటర్లుగా నమోదయ్యారని, ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఈ సమావేశానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు పొలాస నరేందర్, రామస్వామిగౌడ్, రాము, జింక ఎల్లయ్య, వేములవాడ తహసీల్దార్ మహేశ్, డీటీ శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
సిరిసిల్ల జిల్లా :
9951602934, 9010610963
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
సిరిసిల్ల : రఘు - 7331119957
వేములవాడ : నవీన్ - 7997958211
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899